టిటిడిలో ఆన్‌లైన్‌లో వాచీల ఈ- వేలం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన ఉపయోగించిన, పాక్షికంగా దెబ్బతిన్న 62 లాట్ల వాచీలు జూన్ 2 నుండి 3వ తేదీ వరకు టిటిడిలో ఆన్‌లైన్ ద్వారా ఈ - వేలం వేయనున్నారు. వీటిలో టైటాన్, సిటిజెన్, సొనాటా, రాగ, టైమ్స్ వన్, టైమ్స్, టైమెక్స్ తదితర స్మార్ట్ వాచీలు ఈఏఐడి నెం. 25106, 25107, 25108, 25109 ద్వారా ఈ - వేలం వేయనున్నారు. ఆసక్తి కలిగిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ - కొనుగోలు పోర్టల్‌లో రిజిస్టర్ అయిన బిడ్డర్లు వాచీల వేలంలో పాల్గొనటానికి అర్హులు. ఇతర వివరాలకు స్థానిక హరేకృష్ణ మార్గంలోని టిటిడి జనరల్ మేనేజర్, ఏఈవో, వెబ్‌సైట్ ద్వారా ఫోన్ నెంబర్ 0877 - 2264429 ద్వారా సంప్రదించగలరు.

కొనుగోళ్ల తంటా.. కల్లాల్లోనే పంట..

- కల్లాల్లో 20 రోజులుగా ధాన్యం
- కొనేవారే లేక రైతుల అవస్థలు
- అరా కొరగా చేతుకొచ్చిన వరిని కొనేవారు కరువు

ప్రజాశక్తి- కేవీబీ పురం

ఆరుగాలం పంటను సాగు చేసిన రైతుకు చివరి దశలో కష్టాలు తప్పడం లేదు. కష్టపడి పంట పండించి కోత కోసిన తరువాత కూడా ధాన్యం కొనుగోళు అవుతుందో లేదో అని రైతులకు ఎదురు చూడాల్సిన పరిస్థితి. కేవిబి పురం మండలంలో వరి రైతులు గత 20 రోజులుగా ధ్యానం కొనుగోలు చేసే మిలర్లు వ్యాపారస్తులకు కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలో పలు గ్రామాల్లో బోరు బావుల కింద రైతులు వరి పంటను సాగు చేశారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలతో వరి పంట పెద్ద ఎత్తున నేలవాలింది. వర్షాన్ని తట్టుకుని చేతుకొచ్చిన అరకొర పంటను కొనేవారు లేక రైతులు ప్రభుత్వంపై ఆశగా ఎదురుచూస్తున్నారు.

పొలాల్లో కప్పలు పోసిన వరి ధాన్యం

ధాన్యం ఆరబెడుతున్న రైతులు

మండలంలోని రాయపేడు, ఆరే అంజూరు, బ్రాహ్మణపల్లి, వగత్తూరు, కెవిబి పురం, కలత్తూరు, ఎన్‌పే రాజులు కండ్రిగ గ్రామాలలో వరి కోత కోసి కుప్పలు వేసి అమ్మడానికి సిద్ధంగా ఉంచారు. ఒక ఎకరా 20 క్వింటాళ్ల దిగబడి రావాల్సి ఉండగా అకాల వర్షాలు వలన 5 క్వింటాల మించి దిగుబడి రాలేదు. ఉన్న అరకొర పంటను కూడా కొనేవారు లేక గత 20 రోజులుగా వరి ధాన్యాన్ని కలాల్లో వేసుకుని, కాపలాగా రైతులు అక్కడే ఉండవలసిన పరిస్థితి నెలకొంది. వర్షం వస్తే ధాన్యం కుప్పలను కప్పుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

గత ఏడాది ప్రభుత్వం క్వింటాకు రూ.2250ల ధరతో కొనుగోలు చేసింది. ప్రస్తుతం రూ.1300 నుంచి 1500లకు మించి వ్యాపారస్తులు అడగడం లేదు. ఈ ధరలో పంటను విక్రయిస్తే పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి. మండలంలో స్థానికంగా మార్కెట్ యార్డ్ లేకపోవడంతో పంట విలువలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తమిళనాడు నుంచి కొందరు వ్యాపారస్తులు పంటను కొనేందుకు వస్తున్నారు, వారు కూడా అప్పు అడుగుతున్నారు. గతంలో ఇలా తమిళనాడు నుంచి వచ్చిన వ్యాపారస్తులు అప్పుగా పంటలు తీసుకుని వెళ్లి తరువాత డబ్బులు ఇవ్వకుండా రైతులకు చుక్కలు చూపించారు. ఈ నేపథ్యంలో ఇలాంటి వారికి పంటను అమ్మేందుకు రైతులు భయపడుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు స్థానికంగానే వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీలు నెరవేరలేదని రైతులు వాపోతున్నారు.

ధాన్యం కొనేవారి కోసం ఎదురుచూస్తున్నాం..

- మణి, రైతు, రాయపేడు

ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. డీఏపీ యూరియా కాంప్లెక్స్ ఎరువులు ప్రతి సంవత్సరం పెంచుకుంటూ పోతున్నారు. పంటకు మాత్రం కనీసం మద్దతు ధర ఇవ్వడం లేదు. పంటలకు ధరలు లేక పెట్టుబడులు కూడా చేతికందలేదు. ప్రస్తుతం వరి పంటను అమ్మకానికి సిద్ధంగా ఉంచినా కొనేవారు లేక కలాల్లో పంటలు వేసుకుని వ్యాపారుల కోసం ఎదురు చూస్తున్నాం..

ప్రభుత్వమే వరిని కొనాలి..

- దాసరి జనార్ధన్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

వరి పంట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. గత జనవరిలో క్వింటా రూ.2250ల ధరకు వరి అమ్ముడుపోయింది. ప్రభుత్వం ఈ ధర అటుంచి కనీసం కొనేందుకు వ్యాపారులెవరు ముందుకు రావడం లేదు. తక్కువ ధరతో ఇస్తే పంటలు కొనుగోలు చేసేందుకు దళారులు వస్తున్నారు. వీరికి ఈ పంటలు అమ్మితే పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రావు పైగా చేసిన అప్పులు తీర్చలేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మద్దతు ధరతో పంటలు కొనుగోలు చేసి రైతులు ఆదుకోవాలి.

చల్లగా చూడమ్మా గంగమ్మ..

- ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకున్న సీఎం
- గంగమ్మకు రాష్ట్ర ప్రభుత్వ పట్టు వస్త్రాలు, సారె సమర్పణ

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం నియోజకవర్గం కుప్పం గంగమ్మ జాతరలో భాగంగా శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ తల్లికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారి సతీమణి నారా భువనేశ్వరితో కలిసి రాష్ట్ర ప్రభుత్వం, టిటిడి తరపున అమ్మ వారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. బుధవారం శ్రీ తిరుపతి ప్రసన్న గంగమాంబ అమ్మవారి జాతర నిమిత్తం బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి గుడిపల్లి ద్రావిడ యూనివర్సిటీ ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు హెలిక్యాపటర్‌లో చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కుప్పంకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. కుప్పంలో అత్యంత వైభవంగా నిర్వహించే శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవాలలో చివరి ఘట్టమైన అమ్మవారి విశ్వరూప దర్శనంతో చేసుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి ప్రభుత్వ విప్, ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, ఏపిఎస్ ఆర్‌టిసి వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఆలయ ఛైర్మన్ రవిచంద్రబాబు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వెంట ముఖ్యమంత్రి కార్యదర్శి పిఎస్.ప్రద్యుమ్న, టిటిడి పాలకమండలి ఛైర్మన్ బీఆర్ నాయుడు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పి మణికంఠ చందోలు, కడ పీడీ వికాస్ మర్మత్, టిటిడి పాలకమండల సభ్యులు వైద్యం శాంతారాం, కుప్పం మున్సిపల్ ఛైర్మన్ సెల్వం, నాయకులు డాక్టర్ సురేష్ బాబు, రాజ్ కుమార్, డాక్టర్ సుధీర్, సత్యేంద్ర శేఖర్ పాల్గొన్నారు.

సాదర వీడ్కోలు..

కుప్పం గంగమ్మ జాతరలో భాగంగా శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ తల్లికి కుటుంబ సమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించి తిరిగి బుధవారం మధ్యాహ్నం 3.26 గంటలకు ద్రావిడ యూనివర్సిటీ ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి బెంగుళూరుకు బయలుదేరిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు సాదర వీడ్కోలు లభించింది. అనంతపురం రేంజ్ డీఐజీ హిమోషి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఎమ్మెల్సీ, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కె.మురళీమోహన్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, అధికారులు ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికారు.

'శ్రీ పద్మావతీ హృదయాలయ' నిర్వహణపై ఈవో సమీక్ష

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతిలోని శ్రీపద్మావతీ చిన్నపిల్లల హృదయాలయంలో చిన్నపిల్లల ఆరోగ్య సంరక్షణ, వైద్యసేవల దృష్ట్యా టిటిడిలో కొత్తగా ఓ ట్రస్ట్ ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని టిటిడి ఈవో జె. శ్యామల రావు అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి నిర్వహణపై అధికారులతో ఆసుపత్రి సమావేశ మందిరంలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ, శ్రీపద్మావతీ చిన్నపిల్లల హృదయాలయంలో ఇప్పటికే శ్రీవేంకటేశ్వర ఆపన్న హృదయం స్కీమ్ ఉందని, ఈ స్కీం క్రింద రూ.లక్ష దాత విరాళం అందిస్తే నిరాదరణకు గురైన పేద వర్గాలకు చెందిన ఒక పిల్లవాడికి ఉచితంగా ఆపరేషన్ చేసే సదుపాయం ఉందన్నారు. టిటిడిలో ఇప్పటికే ఉన్న పలు ట్రస్ట్ తరహాలో నూతనంగా చిన్నపిల్లల వైద్యసేవల కోసం ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటుకు సంబంధించిన నియమ నిబంధనలపై నివేదిక తయారు చేయాలని అన్నారు. చిన్న పిల్లలను దైవ సమానులుగా భావించి, ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే పసి బిడ్డలకు చక్కటి వైద్యసేవలు అందిస్తున్నారని ఆయన అన్నారు. పిల్లలకు సంబంధించి గుండె చికిత్సలతో పాటు చిన్నపిల్లల గుండె సర్జరీల సంఖ్యను పెంచేందుకు అవసరమైన వైద్య పరికరాలు, మౌళిక సదుపాయాలు, అత్యవసర మందులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నూతన భవన నిర్మాణం తాజా పరిస్థితిపై ఆయన ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష చేసి తాజా పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చిన్న పిల్లల ఐసియూ బ్లాక్, జనరల్ వార్డు, ఓపి బ్లాక్‌లోని పిల్లలకు అందుతున్న వైద్యసేవలపై వైద్యులను, పిల్లల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తల్లితండ్రులు ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలపై తమ సంతృప్తిని ఈవోకు తెలియజేశారు. కార్యక్రమంలో టిటిడి జేఈవో వి.వీరబ్రహ్మం, సీఈ టివి.సత్యనారాయణ, ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఎన్.శ్రీనాథ్ రెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ భరత్, ఎస్ఈలు వేంకటేశ్వర్లు, మనోహరం అధికారులు పాల్గొన్నారు.

స్విమ్స్ సిటి సర్జరీ విభాగంలో

సంక్లిష్టమైన ఆపరేషన్ విజయవంతం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

స్విమ్స్ సిటి సర్జరీ విభాగంలో సంక్లిష్టమైన ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించ్చినట్లు సిటి సర్జరీ విభాగధిపతి డాక్టర్ సత్యవతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ కర్నూలు జిల్లా, మంత్రాలయ మండలం, పరమాన్ దొడ్డి తాండా గ్రామంకు చెందిన ఎస్.అన్నాబాయ్ (24) మహిళ స్విమ్స్ సిటి సర్జరీ విభాగంలో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఈనెల 1వ తేదిన అడ్మిట్ అయినట్లు తెలిపారు. అన్నాబాయ్ అనే మహిళ అఖండ్రోప్లాసియా (మరగుజ్జు) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ స్విమ్స్‌కు వచ్చారని, పరీక్షలు నిర్వహించిన అనంతరం గుండెలో రెండు కవాటాలు దెబ్బతిన్నాయని వాటిని మార్చడం జరిగిందని, అఖండ్రోప్లాసియా వల్ల శస్త్రచికిత్స సంక్లిష్టమైనదిగా మారిందని పేర్కొన్నారు. ఇది ప్రపంచంలోనే మొదటిసారిగా ఇటువంటి అఖండ్రోప్లాసియా ఆపరేషనను స్విమ్స్ చేయడం జరిగిందని తెలిపారు. సంక్లిష్టమైన శస్త్రచికిత్సలో డాక్టర్ ఆర్‌వి. కుమార్, డాక్టర్ సత్యవతి, డాక్టర్ చిరంజీవి, డాక్టర్ ధీరజ్, డాక్టర్ విష్ణు, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ అలోక్ సామంత్ రే, డాక్టర్ సుముధ, ఇతర వైద్యలు పాల్గొని విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా పేషెంట్ ఎస్.అన్నాబాయ్ తల్లి చంద్రమ్మ మాట్లాడుతూ ఈ ఆపరేషన్‌కు ఖర్చుయ్యే దాదాపు రూ.5లక్షలు టిటిడి. ప్రాణదానం ట్రస్టు ద్వారా పూర్తిగా ఉచితంగా నిర్వహించడం జరిగిందని, ఆపరేషన్‌కు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించిన టిటిడి యాజమాన్యనికి, ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో శ్యామల రావు, స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వి.కుమార్‌కి వారి వైద్యబృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వి.కుమార్ మాట్లాడుతూ స్విమ్స్ ఇలాంటి సంక్లిష్ట ఆపరేషన్లు చేయడం అభినందనీయమని, విజయవంతమైన ఆపరేషన్ నిర్వహించిన సిటి సర్జరీ, అనస్థీషియా విభాగాల వైద్య బృందానికి అభినందనలు తెలియజేశారు.

ఏపీఈ ఏపిసెట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఇంచార్జీ విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అప్పారావు తిరుపతిలోని టిసియస్ ఆయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రంలో ఏపీ ఉన్నత విద్యామండలి పక్షాన జరుగుతున్న ఏపీ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, కామన్ ఎంట్రన్స్–2025 పరీక్ష కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో పరీక్ష ప్రశాంతంగా జరుగుతున్నాయని అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ విశ్వవిద్యాలయం, కాకినాడ వారు ఈపరీక్షలు వారు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

న్యూ లుక్‌లో సూళ్లూరుపేట రైల్వేస్టేషన్

- నేడు వర్చువల్ విధానంలో ప్రధాని మోడీ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో:



అమృత్ భారత్ పథకం కింద దేశంలో ఉన్న రైల్వేస్టేషన్లో కేంద్రరైల్వే శాఖ మరమ్మతులు చేస్తూ న్యూలుక్ రైల్వే స్టేషన్లుగా ప్రారంభిస్తుంది. అందులో భాగంగా తిరుపతి జిల్లా సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ఆధునికరించి నేడు ప్రధాని మోడీ చేతులు మీదుగా వర్చువల్ విధానం ద్వారా గురువారం ప్రారంభించనున్నారు. అమృత్ భారత్ పథకం కింద రాష్ట్రంలో సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను కంప్లీట్‌గా న్యూలుక్‌లో రెడీ అయిపోయింది. గురువారం ప్రధాని మోడీ చేతుల మీదుగా సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ ప్రారంభం కాబోతుంది. అమృత్ పథకంలో భాగంగా తొలిసారి ప్రారంభం కాబోతున్న స్టేషన్‌గా సూళ్లూరుపేట ఏపీలో చరిత్ర సృష్టించడానికి రెడీ అయిపోయింది.

సూళ్లూరుపేట స్టేషనే ఎందుకంటే..

సూళ్లూరుపేట ఏపీ, తమిళనాడు బోర్డర్లో ఉన్న పెద్ద టౌన్. ఇక్కడికి తమిళనాడు బోర్డర్ కేవలం 12 కిలోమీటర్లు మాత్రమే. ఈ స్టేషన్ దాటాక అక్కంపేట, తడ స్టేషన్లు దాటితే చాలు తమిళనాడులోకి ఎంటర్ అయిపోతాం. ఈ స్టేషన్ గుండా 42 ఎక్స్‌ప్రెస్ రైళ్లు, 28 ఈ ఏమియు ట్రెన్స్ ప్రయాణం చేస్తుంటాయి. సూళ్లూరుపేటను (నాన్ సబర్బన్ (గ్రూపు) కేటగిరీలో ఉంచింది ఇండియన్ రైల్వే. అంటే రోజుకి కనీసం 9,000 మందికి పైగా ప్రయాణికులు ఈ స్టేషన్ నుంచి జర్నీ చేయాల్సి ఉంటుంది. భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం ఇస్రో ఇక్కడికి జస్ట్ 18 కిలోమీటర్లు. అలాగే ప్రాచీన చెంగాలమ్మ ఆలయం ఈ ఊర్లోనే ఉంది. ప్రతి శాటిలైట్ ప్రయోగానికి ముందు ఇస్రో శాస్త్రవేత్తలు చెంగాలమ్మ ఆలయాన్ని సందర్శించడం ఒక ఆనవాయితీగా వస్తోంది. నేలపట్టు పక్షుల అభయారణ్యం, పులికాట్ సరస్సు ఇక్కడికి అతి సమీపంలో ఉన్నాయి. ఇలా సూళ్లూరుపేట ఏ విధంగా చూసినా ఏపీలో ముఖ్యమైన టౌన్‌గా ఉంటూ వస్తోంది. ఇవన్నీ గమనించి ఈ స్టేషన్ను డెవలప్ చేయడానికి రూ.14.5 కోట్లను కేటాయించింది కేంద్రం. ఆ నిధులతో కనీ విని ఎరుగని స్థాయిలో సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌ను రెడీ చేశారు అధికారులు.

స్టేషన్ ప్రత్యేకతలు ఇవే..

సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ప్రస్తుతం ఎవరైనా తెలియని వాళ్ళు బయటినుంచి చూస్తే ఒక చిన్న సైజు ఎయిర్పోర్టు లాగా కనిపిస్తుంది. పూర్తిగా ట్రెడిషనల్ లుక్ ఉట్టిపడేలాగా స్టేషన్కు ఎలివేషన్ ఇచ్చారు. అలాగే హైటెక్ రిజర్వేషన్ కౌంటర్, లైట్లతో వెలిగిపోయేలా సీలింగ్ , అధునాతన సీటింగ్ సౌకర్యం, ప్లాట్ ఫామ్‌ల మధ్య మారడానికి రెండేసి లిఫ్టు, క్రొత్త ప్లాట్ ఫామ్‌లు ఏర్పాటు చేశారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు ఉండేలా స్టేషన్‌ను డిజైన్ చేశారు. ఎక్కడికి అక్కడ వాటర్ ఫెసిలిటీతో పాటు భవిష్యత్తు అవసరాలకు పనికొచ్చేలా కంప్లీట్‌గా న్యూలుక్‌లో రైల్వే స్టేషన్ రెడీ చేసినట్టు చెన్నైకు చెందిన గతిశక్తి అధికారి డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ వెంకటేశన్, చెన్నై డివిజన్ పిఆర్ఓ ఏలుమలై తెలిపారు.

ప్రధాని చేతుల మీదుగా రేపే ప్రారంభం

పూర్తిగా న్యూ లుక్‌లోకి మారిపోయిన సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను రేపు ప్రధాన మోడీ స్వయంగా వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. దీనితోపాటు దేశవ్యాప్తంగా వందకు పైగా స్టేషన్లను ఆయన వర్చువల్ పద్ధతిలో దేశానికి అంకితం చేస్తారు. ఏపీలో నిర్మాణంలో ఉన్న మిగిలిన అన్ని అమృత్ భారత్ స్టేషన్‌లకు ఒక రోల్ మోడల్‌గా సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ రెడీ అయ్యిందని స్థానికులు సంబరపడుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: రహదారి ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పక్కా ప్రణాళికతో కృషి చేయాలని, టూవీలర్ వాహనాల చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫిరన్స్ హాల్‌లో జరిగిన జాతీయ రహదారులపై నిత్యం జరిగే ప్రమాదాలపై జిల్లా రహదారి భద్రత కమిటీ సభ్యులతో కలెక్టర్, ఎస్పీ సమీక్ష సమేవేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నాయుడుపేట –పూతలపట్టు జాతీయ రహదారిపై ఇప్పటివరకు జరిగిన రహదారి ప్రమాదాలపై ఆడిట్ నిర్వహించాలని, జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. జిల్లాలో పోలీస్, రవాణా శాఖ వారు సంయుక్తంగా నిర్వహించి గుర్తించిన 100 ప్రమాద బ్లాక్ స్పాట్స్ పై నివేదికను జాతీయ రహదారి అధికారులను కోరారు. తిరుమల ఘాట్ రోడ్లపై ఫిట్నెస్ లేని వాహనాలను ఎటువంటి పరిస్థితుల్లో అనుమతించరాదని ఆదేశించారు. అలాగే పూర్తిస్థాయిలో ఘాట్ రోడ్డును నాన్ స్టాప్ జోన్‌గా పరిగణించాలని దానికి సంబంధిత చర్యలను తీసుకోవాలని టిటిడి విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగినప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ 1033 విధిగా అందరు ప్రయాణికులు వినియోగించేలా ఆ టోల్ ఫ్రీ నెంబర్ గురించి అవగాహన ఉండేలా అందరి అధికారులతో కలసి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని శాఖలు విడివిడిగా కాకుండా సమన్వయంతో కలిసి పనిచేయాలని తెలియజేశారు. జిల్లా రవాణా శాఖ అధికారి మురళి మోహన్, ఎస్ఈ, ఆర్ అండ్ బి మధుసూదన్ రెడ్డి, నెల్లూరు, తిరుపతి, చెన్నై ఎన్‌హెచ్ ఏఐ పిడిలు పాల్గొన్నారు.

తిరుపతిని సంతోషకరమైన నగరంగా తీర్చిదిద్దుతా..

- తుడా అభివృద్ధికి పరుగులు పెట్టిస్తా..
- గత పాలకులు చేసిన తప్పులు నేను చేయను..

నూతన ఛైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి

తుడా కార్యాలయంలో..

బహిరంగ సభలో మాట్లాడుతున్న నూతన తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి

శుభాకాంక్షలు తెలుపుతున్న చిత్తూరు ఎంపి..

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: తిరుపతి నగరాన్ని సంతోషకరమైన నగరంగా శాంతియుతంగా ఉండే నగరంగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తానని, తుడాలో గత పాలకులు చేసిన తప్పులు అవినీతి తాను చేయబోనని నిజాయితీ గల ఛైర్మన్‌గా వ్యవహరిస్తానని తుడా నూతన ఛైర్మన్ డాక్టర్ డాలర్స్ సి.దివాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం తుడా ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత సాయంత్రం చంద్రగిరి నియోజకవర్గ పెరుమాళ్లపల్లి వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. ఇందిరా ప్రియదర్శిని కూరగాయలు మార్కెట్ ఎదురుగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఛైర్మన్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి అంటేనే సంతోషకరమైన నగరంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. భారతదేశంలో తిరుపతి నగరంలో జీవించాలంటే శాంతియుతంగా నగరంగా ప్రజలందరూ అనుకునే విధంగా చేస్తానన్నారు. ఇక్కడ దౌర్జన్యాలు, భూకబ్జాలు ఉండవని చెప్పారు. తుడా పరిధిలో ఉండే అన్ని నియోజకవర్గాలు అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. తుడా ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించిన అప్పటి నుంచి మంచి పాలన అందించడానికి తాను ఎక్కువ ప్రయత్నం చేస్తానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకునే విధంగా తన పాలన ఉంటుందన్నారు. గత వైసిపి ప్రభుత్వం తనకి ఎన్నో రకాలుగా ఇబ్బందులు గురిచేసిందని గుర్తు చేశారు. ఓ ప్రజాప్రతినిధి తన రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని అభివృద్ధి కాకుండా అడ్డుకోవడం జరిగిందన్నారు. తనకు సంబంధించిన రియల్ ఎస్టేట్లో ఉండే లేఅవుట్లు అనుమతులు ఇవ్వకుండా తుడాలో ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురి చేశారన్నారు. గత ప్రభుత్వంలో తుడా ఛైర్మన్ పదవిని అడ్డుపెట్టుకొని వారికి కావలసిన వారికి పనులు చేయడమే కాకుండా తుడా నిధులను భారీగా దుర్వినియోగం చేశారన్నారని, తాను తుడాను అభివృద్ధి చేయడమే కాకుండా తుడా అంటే ఒక బ్రాండ్‌ను తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. తుడా భూములు కబ్జా కాకుండా వాటిని పరిరక్షించే తూడాకు ఆదాయం పెంచేలా చేస్తామన్నారు. తనకి పదవి ఇచ్చిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, గూడూరు సూళ్లూరుపేట, పూతలపట్టు, వెంకటగిరి ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, నెలవల విజయలక్ష్మి, రామకృష్ణ, మురళీమోహన్, టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, తిరుపతి టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, చేనేత జోలి శాఖ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, బిజెపి శ్రీకాళహస్తి నాయకులు కోలానంద్, ఎస్సీ కార్పొరేషన్ మెంబర్ కుమారమ్మ, టిడిపి నాయకులు మబ్బు దేవ నారాయణరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్‌సి.మునికృష్ణ, టిడిపి మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, కార్పొరేటర్ అన్నా అనిత యాదవ్, మాజీమంత్రి పరసారత్నం, టిడిపి జిల్లా మాజీ అధ్యక్షురాలు పుష్పావతి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా డాక్టర్ సి డాలర్స్ దివాకర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వైస్‌ఛైర్మన్ ఎన్.మౌర్య, ఛైర్మన్‌గా దివాకర్ రెడ్డి బాధ్యతలు తీసుకుంటూ ఆయన పలు ఫైళ్లపై సంతకాలు చేశారు. అంతకు ముందు తుడా కార్యాలయంలో పూజలు నిర్వహించి తర్వాత బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తుడా సిబ్బందితో దివాకర్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ మాట్లాడుతూ తుడా అభివృద్ధికి అందరం ఐక్యమత్యంగా కలిసి పనిచేస్తూ అభివృద్ధిలో ముందుకు పోవాలని సూచించారు. తుడా పరిధిలో ఉండే గ్రామాలు అభివృద్ధి చేయడానికి సిబ్బంది కూడా తన వంతు కృషి చేయాలని సూచించారు. అనంతరం తుడా ఇంజనీరింగ్ విభాగం సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్రయ్య, డీఈలు ఎస్.బాష, నరేష్ కుమార్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ దేవీకుమారి, ప్లానింగ్ అధికారి వాసుదేవ నాయుడు, పలువురు ఉద్యోగులు అధికారులు రాజకీయ నేతలు నూతన ఛైర్మన్ దివాకర్ రెడ్డి సత్కరించారు.

అలాగే చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఛైర్మన్ సొంతూరు పెరుమాళ్ళ పల్లెల్లోని డాలర్స్ నివాసంలో పుష్పగుచ్ఛాలందించి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డిని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అభినందనలు తెలిపారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళాలు అందిస్తున్న దాతలు

విరాళాల వెల్లువ

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమలలోని స్వయంబీశ్వర స్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న కల్యాణ మండపం నిర్మాణం కోసం భక్తుల నుండి విరాళాలు సేకరిస్తున్నారు. బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం సోమలకు చెందిన సాంబయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు సీఎం సురేష్, మధుసూదన్ దంపతులు కలసి ఒక లక్ష 116 రూపాయలు విరాళంగా అందించారు. చిన్నయ్య గారి రామకృష్ణ జ్ఞాపకార్థం తమ్ముడు రత్నయ్య, కుమారుడు వాసు దంపతులు 20,116 రూపాయలు, మళ్లి శెట్టిగారి మల్లికార్జున 5,116 రూపాయలు ఆలయ ధర్మకర్త బివి సోమశేఖర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి విద్య, లింగన్న, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షిస్తున్న ఏపీవో బాలమురళి

ఉపాధి పనులు త్వరగా పూర్తి చేయాలి: ఏపీవో

ప్రజాశక్తి -రొంపిచర్ల: రొంపిచర్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి పనులపై ఉపాధి హామీ సిబ్బందితో ఏపీఓ బాలమురళి సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పనుల్లో ఆలస్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఫారం పాండ్లు, సోక్ పిట్స్, వర్మీ కంపోస్ట్ పిట్స్ పనులను గ్రామాల్లో పూర్తి చేయాలన్నారు. రైతులకు కేటాయించిన పనులను పారదర్శకంగా పూర్తి చేయాలని, ఆపై అధికారుల బృందం తనిఖీ చేస్తుందన్నారు. ఉపాధి హామీ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్ కిరణ్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి నివాళి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు బుధవారం పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు అక్బర్ బాషా, ఏపీసీసీ మాజీ కార్యదర్శి ఏపీ పరదేశి పాల్గొన్నారు.

'నాడు- నేడు' నిర్మాణాలు పూర్తయ్యేనా?

- శిథిల భవనాల్లోనే విద్యార్థినుల అవస్థలు
- విద్యా సంవత్సర ప్రారంభం సమీపిస్తున్నా పట్టించుకోని వైనం

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో చేపట్టిన ' నాడు- నేడు' పనులు ముందుకు సాగడంలేదు. ఫలితంగా విద్యార్థినులు శిథిలావస్థ భవనాల్లోనే విద్యను కొనసాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. విద్యా సంవత్సరం ప్రారంభం సమీపిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. శిథిలావస్థకు చేరిన భవనంలోనే విద్యార్థినులు భయం గుప్పెట్లో పెట్టుకుని చదవాల్సి వస్తోంది. ఈ పాఠశాలలో 6వ తరగతి నుండి పదవ తరగతి వరకు వుంది. సుమారు 250 మంది విద్యార్థినులు చదువుతున్నారు. గదుల కొరత కారణంగా వారు నానా అవస్థలకు గురవుతున్నారు. ముప్పై ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పైకప్పు పెళ్లలు ఊడిపడి భయాందోళనకు గురి చేస్తున్నాయి. రెండేళ్ల క్రితం అప్పటి వైసిపి ప్రభుత్వ హయాంలో అదనపు గదులు మంజూరు అయ్యాయి. గుత్తేదారు పనులు ప్రారంభించి బిల్లులు సరిగా రాకపోవడంతో పనులు అర్థాంతరంగా వదిలివేశాడు. 'నాడు-నేడు' పథకం ద్వారా శుద్ధ జలం మంజూరైనా భవనాలు లేకపోవడంతో ఈ పరికరాలు అమర్చకపోవడంతో నిరుపయోగంగా వున్నాయి. తగినన్ని గదులు లేకపోవడంతో 7, 9 తరగతి విద్యార్థినులకు ఒకే చోట విద్యను బోధిస్తున్నారు. ప్రయోగశాల, ఉపాధ్యాయులకు విశ్రాంతి గదులు లేకపోవడంతో ఇటు విద్యార్థినులు, అటు ఉపాధ్యాయుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. అసంపూర్తిగా వున్న అదనపు గదుల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరంలోనైనా విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే గదులు నిర్మాణాన్ని త్వరిత గతిన పూర్తి చేస్తామని ఎంఈవో వేణుగోపాలరెడ్డి పేర్కొన్నారు.

అసంపూర్తిగా వున్న నాడు- నేడు భవన నిర్మాణ పనులు

యండియు వ్యవస్థను రద్దు చేయెద్దు

మరింత మెరుగుపర్చాలి: సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజలకు నిత్యావసరాల పంపిణీలో యండియు వ్యవస్థ రద్దు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, దీనితోపాటు రేషన్ షాపుల వద్ద కూడా సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వహణ లోపాలు సరిదిద్ది, యండియు వ్యవస్థను మరింత మెరుగుపర్చాలని, అవినీతికి తావు లేకుండా ఆధునిక సాంకేతికతో అనుసంధానం చేయాలని కోరుతున్నదని తెలిపారు. యండియు వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటి వద్ద బియ్యం అందించటం ఎంతో సౌకర్యంగా ఉందని, యండియు వాహనం వచ్చే సమయానికి కూలీ పనులకు వెళ్లిన పేదలకు తరువాత రేషన్ డిపో వద్ద సరుకులు తీసుకునేట్లుగా ఏర్పాటు ఉండాలన్నారు. తప్ప మొత్తం వ్యవస్థనే రద్దు చేయడం ప్రజలను ఇక్కట్లుపాలు చేస్తుందన్నారు. ఈవాహనాల ద్వారా అక్రమ రవాణా జరుగుతుందనే నెపంతో ప్రజలకు ఇంటి వద్ద బియ్యం అందించకుండా డిపోలవద్దనే తెచ్చుకోమనటం సరైంది కాదని అన్నారు. యండియు వాహనాల ద్వారా అక్రమ రవాణా జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన సన్నబియ్యం సరఫరా చేసినట్లయితే ప్రజలందరూ వినియోగించడం వల్ల అక్రమ రవాణా కూడా అరికట్టవచ్చు అన్నారు. యండియు వ్యవస్థ రద్దు వలన వాహనాల డ్రైవర్లకు ఉపాధి లేకుండా పోతుందన్నారు. డీలర్లు వ్యాపారం చేసుకు నేందుకు వీలుగా రేషన్ షాపులను కిరాణా దుకాణా లుగా మారుస్తామని, కేంద్రం అందించే భారత్ ఉత్పత్తులు తక్కువ ధరకు అందిస్తామని, దీనికి కేంద్రం అనుమతిచ్చిందని ప్రభుత్వం ప్రకటించిందని, రేషన్ షాపులు నిర్వహణపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలని సిపిఎం కోరుతున్న తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యండియు వ్యవస్థ రద్దు నిర్ణయం ఉప సంహరించుకోవాలని, కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసినట్లుగా బియ్యంతో పాటు కందిపప్పు, నూనె, చింతపండు రేషన్ డిపోల ద్వారా సరఫరా చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు.

సిఎస్ఐ చర్చిని ప్రారంభిస్తున్న బిషప్ శర్మానిత్యానందం

సిఎస్ఐ చర్చిలు ప్రారంభానికి కృషి

- బిషప్ శర్మానిత్యానందం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: గ్రామీణ ప్రాంతాల్లో సిఎస్ఐ చర్చిలు ప్రారంభించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు వేలూరు సిఎస్ఐ డయాసిస్ బిషప్ రేవరెండ్ డాక్టర్ శర్మ నిత్యానందన్ అన్నారు. యాదమరి మండలంలోని కాశరాల పంచాయతీ పరిధిలోని గాంధీపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ గుడ్ షెఫర్డ్ చర్చిని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బిషప్‌కు గ్రామస్తులు, క్రైస్తవ సోదరులు, మత బోధకులు మేళతాలాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్రమైన చర్చిలో దేవుని వాక్యాలను భక్తిశ్రద్ధలతో కీర్తించాలన్నారు. చర్చి నిర్మాణానికి కృషి చేసిన గ్రామస్తులకు దాతలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. బైబిల్ వచనాలు వివరించారు. గాంధీ పురం గ్రామానికి తమకు విడదీయలేని బంధం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన చర్చి పాస్టర్లు , ఫాస్ట్ రేట కార్యదర్శులు కోశాధికారులు, గ్రామ పెద్దలు క్రైస్తవ సోదరులు. అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్యకర్తలకు ప్రభుత్వం అండ

- ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్

ప్రజాశక్తి -కార్వేటినగరం :టీడీపీ కార్యకర్తల కుటుంబానికి ప్రభుత్వం అండగా వుంటూ ప్రభుత్వ విప్, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ అన్నారు. గురువారం కార్వేటినగరం మండలం కోటర్వేడు దళితవాడ గ్రామానికి చెందిన టిడిపి వీరాభిమాని గిరిబాబు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వం ద్వారా అనేక విధాలుగా ఆదుకుంటామని, 20వేల రూపాయలు ఆర్థిక సాయం అందించి, అన్ని విధాలుగా గిరిబాబు కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు టిడిపి కార్యకర్తలకు అండగా ఉంటారన్నారు. కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటానని ఎప్పుడు ఏ అవసరం వచ్చినా సహాయం చేయడానికి ముందుంటా నని తెలిపారు.

టిడిపి కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ విఎంథామస్

క్రైం న్యూస్

ఆగివున్న ట్రాక్టరును ఢీకొన్న ద్విచక్ర వాహనం

ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రమాదంలో మృతి చెందిన ప్రకాష్

ప్రజాశక్తి-సోమల: ఆగివున్న ట్రాక్టరును ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. తమిళనాడు రాణి పేట మండలం కళవాయి గ్రామానికి చెందిన ప్రకాష్ మరికొందరు వరి కోత మిషన్లను బాడుగలకు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం ఇరికిపెంట పంచాయతీ మేటి మంద గ్రామం వద్ద వరి కోత పనులు చేస్తూ మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో సోమలకు వచ్చి వారి పనులు ముగించుకుని తిరిగి మేటి మందకు బయలుదేరారు. సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ బృందావనం సమీపంలో రోడ్డు పక్కగా ఆగి వున్న ట్రాక్టర్ వెనుక ఉన్నట్రాలీని ఢీకొట్టాడు. దీంతో ప్రకాష్ (27) తలకు తీవ్ర గాయమైంది. వెంటనే 108 ద్వారా సదుం సిహెచ్‌సికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మణికంఠ, గోపాల్‌కు తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం రాణిపేట సిఎంసి ఆస్పత్రికి తరలించారని తెలిపారు. మృతుడు ప్రకాష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి నాగరాజా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు.

గంజాయి మత్తులో ఘాతుకం

యువతి గొంతు కోసిన యువకుడు

ప్రజాశక్తి- సోమల: గంజాయి మత్తులో ఓ యువకుడు యువతి గొంతుకోసిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ బంగాళా వద్ద అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే యువకుడు ఎప్పుడూ గంజాయి మత్తులో ఉంటూ తనలో తానే మాట్లాడుకుంటూ పిచ్చి వాడిలా తిరిగేవాడని, బుధవారం ఉదయం 12 గంటల సమయంలో రోడ్డు పక్కన ఉన్న ఇంట్లోకి వెళ్లి కత్తితో ఓ యువతి గొంతుపై కత్తి పెట్టి కోస్తూ ఉండగా పెనుగులాటలో యువతి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి యువతిని కాపాడారు. చికిత్స నిమిత్తం తిరుపతి గ్లోబల్ ఆసుపత్రికి తరలించారు. గంజాయి మత్తులోని యువకుడు అదే ఇంటిలో తలుపులు వేసుకొని ఉండగా పోలీసులకు సమాచారం ఇచ్చి గ్రామస్తులు చాకచక్యంగా అతడిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ జనన ఘట్టం

ప్రజాశక్తి - ఎస్ఆర్‌పురం : తయ్యూరు పాయకట్టు అంకనపల్లి మహాభారతంలో భాగంగా బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీకృష్ణ జనన ఘట్టం ఆకట్టుకుంది. శ్రీకృష్ణుడు చెరసాల్లో దేవకి వసుదేవులకు జన్మించిన అనంతరం శ్రీకృష్ణుని బుట్టతో తీసుకొని నది ప్రవాహాలను దాటే విధంగా ఆలయ ఆవరణలోకి తీసుకొచ్చి యశోదా దేవికి పక్కకు చేర్చే దృశ్యం భక్తుల కంటతడిని తెప్పించింది. యశోదా దేవి పాత్రలో భాగవతారిని పూర్ణ భాగవతారని ఊహించుకుంటూ ఆమెకు అప్పగించడం జోలపాడడం, అనంతరం భక్తులకి తీర్థప్రసాదాలు అందించడం కన్నుల పండుగగా నిర్వహించారు. ఉభయ దాతలుగా నెల్లూరు అనురాధ ఆంజనేయ నాయుడు దంపతులు, అంకనపల్లి గ్రామస్తులు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు లింగారెడ్డి, రామనాథరెడ్డి, లోకనాథ్ రెడ్డి, పురుషోత్తం, ఒడియా గోవిందస్వామి నాయుడు, జగన్నాథం నాయుడు , గ్రామాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిత్తూరు నగరపాలక కమిషనర్ పి నరసింహ ప్రసాద్‌ను ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పరామర్శించారు. బుధవారం సాయంత్రం తిరుపతిలో కమిషనర్ నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేత వసంత కుమార్ పాల్గొన్నారు.

మామిడి దిగుబడి, గుజ్జు పరిశ్రమలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి- తవణంపల్లి: మామిడి దిగుబడి, గుజ్జు పరిశ్రమలపై అవగాహన కల్పించాలని జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్ రెడ్డి సూచించారు. తవణంపల్లి, ఐరాల మండలాల రైతు సేవా కేంద్రాల సిబ్బందితో జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్ రెడ్డి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరానికి మామిడి దిగుబడి అంచనాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రవీణ్, మండల హార్టికల్చర్ ఆఫీసర్ సాగరిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు సేవాకేంద్ర సిబ్బందికి మామిడి దిగుబడి అంచనా విధానం, దానికి సంబంధించిన గణాంకాలపై పూర్తిగా అవగాహన ఉండాలన్నారు. ముఖ్యంగా గుజ్జు పరిశ్రమలకు అవసరమైన మామిడి సరఫరా అంచనాలను పరిగణనలోకి తీసుకుని, సాగు ప్రాంతాల్లో దిగుబడి వివరాలను సేకరించి, పరిశ్రమల అవసరాలను ముందుగానే అంచనా వేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాగే ఆయా మండలాల్లో హార్టికల్చర్ సిబ్బంది, గుజ్జు పరిశ్రమలను పర్యవేక్షిస్తూ రైతుల నుండి వచ్చే దిగుబడి పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఉన్నదేనా? అనే దానిపై ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ విషయంలో మండల స్థాయి హార్టికల్చర్ సిబ్బందితో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. మామిడి దిగుబడి సమయానికి సరైన ప్రణాళికలు రూపొందించుకుంటే, రైతులకు మంచి లాభాలు, పరిశ్రమలకు నాణ్యమైన ఉత్పత్తి అందించవచ్చని ఆయన తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికే మినీ మహానాడు

ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్

పజాశక్తి - ఎస్ఆర్ పురం : నియోజకవర్గంలో సమస్యల గురించి అన్ని మండలాల నాయకులతో చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకోవడం కోసమే నియోజకవర్గ స్థాయిలో మినీ మహానాడులు నిర్వహించి అందులో సమస్యలపై ప్రస్తావించి వాటిని జిల్లా సమావేశాలకు తీసుకెళ్లి అటు నుంచి రాష్ట్ర స్థాయి మహానాడు దేశాల్లో సమస్యల ఉంచడం కోసమే మినీ మహానాడు నిర్వహిస్తున్నట్లు గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ అన్నారు. ఎస్ఆర్ పురం మండల కేంద్రంలో ఓ ప్రవేట్ కళ్యాణ మండపంలో మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నుంచి అన్ని మండలాల అధ్యక్షులు జిల్లా నాయకులు రాష్ట్ర నాయకుల నుంచి మండలాల వారిగా సమస్యలపై చర్చించారు. గుర్తించిన సమస్యలను నివేదికగా తయారు చేశారు. కార్యదర్శులు గ్రామస్థాయి నాయకులు సభ్యులు పాల్గొని ఎమ్మెల్యేకి బాడీ గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు అన్ని మండలాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు అధ్యక్షులు మండలంలో సమస్యలను వివరించారు. ఈ మహానాడులో నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఎస్ఆర్ పురం మండలంలో ఫైర్ స్టేషన్ వెదురుకుప్పం మండలంలో మినీ స్టేడియం మండలంలోని సింగల్ రోడ్లకు రహదారుల రూపకల్పన, ఎస్ ఆర్ పురం మండలం జిఎంఆర్ పురం వద్ద వంతెన ఇలా అన్ని మండలాల్లోని సమస్యలను గుర్తించి వాటికి తీర్మానంలో పొందుపరిచారు. యువతకు ఉపాధి, మౌలిక వసతులపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే సభను ఉద్దేశించి మాట్లాడుతూ కార్యకర్తల పోరాటపటిమా? వారి శ్రమ ఫలితంగా తనకి పదవి వచ్చిందని తాను నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యకర్తల అదృష్టం మేరకే అన్ని కార్యక్రమాలు జరుగుతాయని సభ పూర్వకంగా తెలిపారు. మండలంలో అభివృద్ధికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంధం నేని జయశంకర్ నాయుడు, కార్వేటినగరం మండల పార్టీ అధ్యక్షుడు సింగల్ రాజ్ యాదవ్ వెదురుకుప్ప మండల పార్టీ అధ్యక్షుడు లోకనాథ్ రెడ్డి, గంగాధర్ మండల పార్టీ అధ్యక్షులు స్వామి దాసు, పాలసముద్రం మండల పార్టీ అధ్యక్షుడు రాజేంద్ర, అన్ని మండలాల పార్టీ నాయకులు, రాష్ట్ర నాయకులు చిట్టిబాబు నాయుడు జిల్లా నాయకులు శ్రీధర్ యాదవ్, గంధం నేని రాజశేఖర్ నాయుడు, గుండయ్య , మోహన్ మురళి, భాస్కర్ నాయుడు సిద్దయ్య శెట్టి, సూరిరెడ్డి, పైనే మురళి, అని మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అండగా నిలవాలి: మాజీ మంత్రి

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : చట్టపరమైన అంశాల్లో అండగా నిలవాలని వైసిపి లీగల్‌సెల్ నేతలకు మాజీ మంత్రి ఆర్‌కె రోజా సూచించారు. బుధవారం ఆ పార్టీ లీగల్‌సెల్ నేతలు మాజీమంత్రి ఆర్ కే రోజా ఆమె స్వగృహంలో కలిశారు. తమకు పదవి కేటాయించినందుకు ఆ పార్టీ మున్సిపల్ లీగల్‌సెల్ అధ్యక్షులు నాగరాజు ఆమెను దుశ్శాలువలతో, పూలదండలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ పార్టీ నేతలకు న్యాయపరమైన సలహాలు, సూచనలు ఇవ్వడంలో లీగల్‌సెల్ నేతలు చురుకుగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమం లో ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, నాయకులు యాకోబు, యోవాన్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఆర్‌కె రోజాను సన్మానిస్తున్న వైసిపి లీగల్‌సెల్ నేతలు

టిడిపి వార్డు కమిటీల ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర పాలక పరిధిలోని 50 వార్డులకు సంబంధించి టిడిపి కమిటీలను ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు సునీల్ కుమార్, మారుతి చౌదరి, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, ఇతర ముఖ్య నాయకుల పర్యవేక్షణలో వార్డుల వారీగా కమిటీ ఎన్నికపై చర్చించారు. మాజీ క్లస్టర్, డివిజన్ ఇన్‌ఛార్జిలు, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులతో చర్చించి కమిటీల ఎన్నికలు పూర్తి చేశారు. మొత్తం 50 వార్డులకు అధ్యక్ష, కార్యదర్శులతో సహా కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ.. నూతన కమిటీలు క్షేత్ర స్థాయిలో కష్టపడి పని చేయాలని, పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అందరు నాయకులను, కార్యకర్తలను కలుపుకొని ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీల సభ్యులు ఎమ్మెల్యే, ఇతర ముఖ్య నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టిడిపి వార్డు కమిటీల సభ్యులు

మహానాడును జయప్రదం చేయాలి

తెలుగు తమ్ముళ్లకు ఎంపీ పిలుపు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: మహానాడును జయప్రదం చేయాలని తెలుగుతమ్ముళ్లకు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లా టిడిపి కార్యాలయంలో టిడిపి పార్లమెంట్ జిల్లా స్థాయి మహానాడు సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి బుధవారం చిత్తూరు జిల్లా టిడిపి కార్యాలయంలో టిడిపి పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సిఆర్ రాజన్, టీడీపీ పార్లమెంటరీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చూడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టి బాబు నాయుడు, పార్టీ కార్యాలయం కార్యదర్శి మోహన్ రాజ్, పార్టీ సీనియర్ నేతలు చంద్ర ప్రకాష్ తదితరులు సమావేశమై మహానాడు నిర్వహణపై చర్చించారు. అదే సమయంలో కడప వేదికగా జరుగనున్న మహానాడు మహాసభలను విజయవంతం చేసే అంశాల పై సుదీర్ఘంగా సమీక్షించారు. చిత్తూరు టిడిపి కార్యాలయంలో జరిగే మహానాడులో తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలను టిడిపి అధిష్టానానికి నివేదించే విషయాన్ని కూడా ఈ సందర్భంగా చర్చించుకున్నారు. పార్టీ శ్రేణులు ఐకమత్యంగా పనిచేసి చిత్తూరు టిడిపి కార్యాలయంలో తలపెట్టిన పార్లమెంటు స్థాయి మహానాడు సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇదే స్ఫూర్తితో కడపలో మహానాడును విజయవంతం చేయడంలో చిత్తూరు టిడిపి నాయకులు, కార్యకర్తలు కీలక భూమిక పోషించాలని నిర్ణయించారు.

మృగరాజుపై వేణుగోపాలుడి విహారం

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరం టీటీడీ అనుబంధం శ్రీవేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం రాత్రి కాళ సర్పంపై నృత్యవేణుగోపాలుడుగా ముత్యపు పందిరి వాహనం, ఉదయం సింహవాహనంపై వేణుగోపాలుడు ఊరేగాడు. తెల్లవారు జామున సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అభిషేకం, శుద్ధి. తోమాల, అర్చన నిర్వహించి తొలిగంటలో నైవేద్యం సమర్పించారు. ఉదయం 7.30 గంటలకు వేద నరసింహ అవతారంలో స్వామి మృగరాజు సింహ వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరించారు. అనంతరం 10 గంటల నుంచి 11 గంటల మధ్య రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులకు వేదపండితులు వేద మంత్రాల నడుమ పాలు. తేనె, పసుపు, చందనం నారికేళి జలాలు వంటి సుగంధ ద్రవ్యాలతో వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణ అవతారంలోని శ్రీవేణుగోపాలునికి ఆలయ ఆవరణలోని ఊంజల్ మండపంలో టీటీడీ బృందం గాత్ర కచేరితో కన్నుల పండుగగా ఊంజల్ సేవ నిర్వహించారు.

ముత్యపు పందిరిపై వేణుగోపాలుడు

వాహన సేవల్లో పాల్గొన్న ఆలయాధికారులు

వార్షిక బ్రహ్మో త్స వాలలో భాగం గా బుధవా రం రాత్రి రుక్మిణీ సత్యభా మ సమే తుడై వేణు గోపాలుడు ముత్య పు పందిరి వాహ నం పై కొలువుదీరి చిన్నారుల కోలాటా లు. మహిళల చెక్కభజనల, మంగళ వాయి ద్యాలు నడుమ అత్యంత వైభవంగా మహిళల చెక్క భజనల, మంగళ వాయిద్యా లు, నడుమ అత్యంత వైభవంగా పుర వీధుల్లో ఊరేగారు. రాత్రి 9.30 గంటలకు ఏకాంత సేవతో స్వామి ని పవళింప చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవి, సూపరింటెండెంట్ సోముశేఖర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబ్ బాబు సురేష్, కంకణభట్టర్ తరుణ్‌కుమార్, వేద పండితులు నారాయణ దాశరథి, గోపాలాచార్యులు, రమేష్, శభరీష్, అలంకార పండితులు మోహన భట్టాచార్యులు, టీటీడీ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన గంగ జాతర

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీలో మంగళ, బుధ వారాలలో నిర్వహించిన గంగ జాతరలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం సాయంత్రం 9 గంటలకు అమ్మవారి మట్టి విగ్రహానికి శిరస్సు ఏర్పాటు చేసి ఊరేగింపుగా తీసుకువచ్చి శివాలయం వద్ద ఏర్పాటుచేసిన చలువ పందిరి కింద ప్రతిష్టించారు. మహిళలు రాత్రి పొంగళు సమర్పించారు. అమ్మవారి ఎదురుగా సంగీత విభావరి ఏర్పాటు చేసి యువత పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. ఉదయం నడివీధిలో గ్రామ మహిళలు, పిల్లలు, వృద్ధులు పొంగళ్లు సమర్పించారు. భారతం మిట్ట, గన్నవారిపల్లి, రాజీవ్ నగర్ కాలనీ, దిడ్డి వారి పల్లి, దళితవాడ, అడుసుపల్లి, గుంత చెరువుపల్లి, చిన్న సోమల, ముంద్రివారిపల్లి, గొల్లపల్లి గ్రామాలలోనూ గంగ జాతర నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. రాత్రి 9 గంటల తరువాత ఆశాధి వారి పాటల తో అమ్మవారికి నైవేద్యం సమర్పించి నిమజ్జనానికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామంలో మంగళవారం నడివీధి గంగమ్మ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు గంగమ్మను కుల మతాలకతీతంగా దర్శించుకున్నారు. వివిధ విచిత్ర వేషాలతో గంగమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బుధవారం గంగమ్మ నిమజ్జనం చేశారు. పంచాయతీ నుండే కాకుండా తమిళనాడు, కర్ణాటక పక్క పంచాయతీలో అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. రాత్రి అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి డబ్బులతో కోలాటాలతో సాంస్కృతిక కార్యక్రమాలతో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త రామస్వామి శేఖర్ మొదలి, గ్రామస్తులు యువతులు పాల్గొన్నారు.

గుడిపాలలో

గంగ జాతరలో ఎమ్మెల్యే

గుడిపాల: గుడిపాల మండలంలోని కట్టకింద పల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన గంగ జాతరలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొన్నారు. అమ్మవారి సేవలో పాల్గొని పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకి పూలమాలతో స్వాగతం పలికి సత్కరించారు.